క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్యపై విచారణ


యువకుడి ఆత్మహత్యపై విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు: యువతి నయవంచనతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం మండలంలోని ఉప్పుగుండూరులో విచారణ చేపట్టారు. యువకుడు కందుల ప్రవీణ్ ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యువకుడు ప్రవీణ్ ఆత్మహత్య చేసుకున్న తీరును పరిశీలించారు. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కందుల ప్రవీణ్ ప్రేమించిన యువతి బెదిరింపులకు పాల్పడటంతో పాటు కేసుల్లో ఇరికిస్తానని హెచ్చరించడంతో ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందాడు. కుమారుడి మృతిపై అనుమానంతో తండ్రి కందుల డానియేలు ఆధారాలతో సహా యువతి హరిణిలక్ష్మి, ఆమె తండ్రి తిరుమల రావు, స్నేహితురాలు యామినీ చౌదరిపై ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడంతో శనివారం ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు ఉప్పుగుండూరు గ్రామంలో కుటుంబ సభ్యులను, సాక్షులను విచారించి ఆధారాలు సేకరించారు. దళిత యువకుడి ఆత్మహత్యకు కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘ నేతలు నీలం నాగేంద్రం, కుమ్మారి సుధాకర్, పక్కెల వజ్రం బాబు డిమాండ్ చేశారు.

సంపు కోసం స్థల పరిశీలన


మర్రిపాలెంలో స్థల పరిశీలన చేస్తున్న ఎంపీడీవో, జెడ్పీటీసీ

చీమకుర్తి రూరల్: మండలంలోని మర్రిపాలెం గ్రామంలో సంపు కోసం ఎంపీడీవో కే రాఘవేంద్ర, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు శనివారం స్థలాన్ని పరిశీలించారు. కేవీ పాలెం, ఏలూరి వారిపాలెం గ్రామాల ప్రజలకు తాగునీరు అందించాలంటే ముందుగా కేవీ పాలెం సంపునకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. మర్రిపాలెంలో సంపు నిర్మించి అధిక సామర్థ్యం కలిగిన మోటారు ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకు గానూ మర్రిపాలెంలో శనివారం సంపు కోసం స్థల పరిశీలన చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శాంతిప్రియ, ఏలూరివారిపాలెం సర్పంచ్ శ్రీ లక్ష్మీ సురేష్, బొద్దు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లకు స్థలాల పరిశీలన

మద్దిపాడు: మద్దిపాడులో అంగన్‌వాడీ సెంటర్ల ఏర్పాటుకు తహసీల్దార్ సృజన్ కుమార్ శనివారం ఉదయం స్థలాలను పరిశీలించారు. స్థానిక బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను ఆయన పరిశీలించారు. వీటికి ప్రత్యామ్నాయంగా స్థలాలను కూడా పరిశీలించారు. ఇటీవల మద్దిపాడుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా వచ్చిన నేపథ్యంలో గ్రామస్తులు కొందరు అంగన్‌వాడీ సెంటర్ల దుస్థితిని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అంగన్‌వాడీ సెంటర్ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు మద్దిపాడు తహసీల్దార్ అంగన్‌వాడీ సెంటర్ల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. కానీ, ఖాళీ స్థలాలు గ్రామం బయట ఉండటంతో పాటు అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటుకు కాలనీలో స్థలం లభించకపోవడం వంటి కారణాలతో బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ కూల్చివేసి అక్కడే నిర్మాణం చేపట్టే విధంగా, ఎస్సీ కాలనీలో సగం వరకు నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను అక్కడే నిర్మించే విధంగా ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.


ఒంగోలులోని భాగ్యనగర్ 2వ లైన్‌లో పాత జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కుక్క పిల్లలతో తిరుగుతున్న కుక్కలు

డాగ్స్.. డేంజర్ బెల్స్..!

- ఒంగోలు నగరంలో రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతున్న వీధి కుక్కలు
- గుంపులుగా సంచరిస్తూ దాడి చేస్తుండటంతో ప్రజల బెంబేలు
- ఏ వీధిలో చూసినా శునకాల గుంపులు
- సంతాన నిరోధక శస్త్ర చికిత్సల్లో విఫలమైన నగరపాలక సంస్థ అధికారులు
- సంతానంతో కలిసి స్వైరవిహారం చేస్తున్న కుక్కలు
- ఆందోళనలో చిన్నారుల తల్లిదండ్రులు

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు నగరం కుక్కలమయంగా మారింది. ఏ వీధిలో చూసినా పదుల కొద్దీ కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. రోడ్లపై రాకపోకలు సాగించే ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఒంటరిగా చిన్నారులు కనిపిస్తే మరింత రెచ్చిపోతున్నాయి. వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసి వాటి సంఖ్య పెరగకుండా చర్యలు చేపట్టినట్లు ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నప్పటికీ.. ఒంగోలు నగరంలోని వీధుల్లో గుంపులకొద్దీ కొత్త సంతానంతో కుక్కలు కనిపిస్తున్నాయి. స్థానిక చిన్నారులు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు పొరపాటున ఆయా కుక్కపిల్లల వద్దకు వెళ్తే.. వెంటనే పెద్ద కుక్కలు వచ్చి కరిచి గాయపరుస్తున్నాయి. నగరంలో ఏదో ఒకచోట ప్రతిరోజూ కుక్కల దాడిలో చిన్నారులు గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారు. రోజుల తరబడి చికిత్స, ఇంజక్షన్లు తీసుకోవాల్సి ఉండటంతో నరకం చూస్తున్నారు. ఇప్పటికే ఉన్న కుక్కలతో జనం అల్లాడుతుంటే.. కొత్తగా పుట్టిన కుక్క పిల్లలు పెద్దవైతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్సల కేంద్రం ఏమైనట్టు..?

వీధి కుక్కలను చంపడం శిక్షార్హమైన నేరం కావడంతో అలాంటివేమీ చేయకుండా కేవలం వాటి సంతతి పెరగకుండా సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది. అలాంటి శస్త్రచికిత్సలు నిర్వహించి వాటి గాయాలు మానేవరకూ జంతు సంరక్షణ కేంద్రాల్లో ఉంచి వాటికి ఆహారాన్ని అందించి తిరిగి వాటిని తెచ్చిన ప్రదేశాలలోనే వదిలివేయాలి. ఒంగోలు నగరంలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు స్థానిక కొత్త మామిడిపాలెం వద్ద శునకాలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సల కేంద్రాన్ని నగరపాలక సంస్థ అధికారులు ఇటీవల ప్రారంభించారు. స్నేహ యానిమల్ కేర్ అనే సంస్థకు ఆ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ సంస్థ వారు కుక్కలను పట్టుకుని వాహనంలో తీసుకురావడం, శస్త్రచికిత్సలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేయాలి. కానీ, నగరంలో అలా జరగడం లేదు. నగరంలోని అనేక వీధుల్లో అర డజన్ల కొద్దీ కుక్క పిల్లలతో కుక్కలు కనిపిస్తుండటమే అందుకు నిదర్శనంగా ఉంది. శునకాలకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామంటున్న అధికారులు.. వీధులలో కనిపిస్తున్న కుక్క పిల్లల గుంపులకు సమాధానం చెప్పాలి. శస్త్రచికిత్సలు చేసిన కుక్కల చెవులకు వీ షేప్‌లో కట్ చేస్తారు. అటువంటి శునకాలు కూడా నగరంలో మచ్చుకైనా కానరావడం లేదు. ఈ శస్త్రచికిత్సలను డిసెంబర్‌లో ప్రారంభించామని, రోజుకు 25 కుక్కల వరకూ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతుండగా, క్షేత్రస్థాయిలో ఆ దాఖలాలే కనిపించకపోవడం విశేషం. స్నేహ సంస్థకు కుక్కలను పట్టుకొచ్చినందుకు, శస్త్రచికిత్స చేసినందుకు, వాటికి ఆహారం అందించినందుకు, తిరిగి అదే ప్రాంతంలో వదిలివేసేందుకు ఒక్కో కుక్కకు ప్రభుత్వం రూ.1,500 అందిస్తోంది. కానీ, ఎక్కడా వాటి ఫలితాలు కనిపించకపోవడం, నగరపాలక సంస్థ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.


ఒంగోలు అన్నవరప్పాడు వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

విద్యార్థులను ఒంటరిగా స్కూళ్లకు పంపేందుకు భయపడుతున్న తల్లిదండ్రులు...

నగరంలోని పెళ్లూరు, రామ్‌నగర్, అన్నవరప్పాడు, సంతపేట, క్లౌ పేట, కబాడీపాలెం, మరాఠిపాలెం, రైలుపేట, భాగ్యనగర్, తదితర అన్ని ప్రాంతాలలో వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులపై దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో స్థానికులు తమ పిల్లలను ఒంటరిగా స్కూళ్లకు పంపేందుకు కూడా భయపడుతున్నారు. చిన్నారుల చేతుల్లో తినుబండారాలు, కవర్లు వంటివి ఉన్నాగానీ లాక్కునేందుకు ప్రయత్నిస్తూ కుక్కలు దాడి చేస్తున్నాయి. దీంతో స్కూళ్లకు వెళ్లే విద్యార్థులే ఎక్కువగా శునకాల బారిన పడుతున్నారు. కొత్తవారు ఎవరైనా కనిపిస్తే ఆ వీధిలోని కుక్కలన్నీ ఒక్కసారిగా అరుస్తూ దాడి చేసేందుకు ప్రయత్నిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో ఏ రోడ్డులో ఏ కుక్క దాడి చేస్తుందో అని భయపడుతూ నగరవాసులు బిక్కుబిక్కుమంటూ రోడ్లపై తిరగాల్సి వస్తోంది.



ద్విచక్ర వాహనాల వెనుక పరిగెత్తి మరీ దాడి చేస్తున్న శునకాలు...

నగరంలో రాత్రివేళల్లో రోడ్లన్నింటినీ ఆక్రమించేస్తున్న శునకాల గుంపులు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించి మరీ కరుస్తున్నాయి. వాటి బారి నుంచి తప్పించుకునే క్రమంలో వాహనదారులు అదుపుతప్పి కింద పడి గాయపడుతున్నారు. రాత్రయితేనే రోడ్లపై పెద్దపెద్దగా అరుస్తూ కుక్కలు భయాందోళనకు గురిచేస్తుండటంతో ప్రాణాలు అరచేత పట్టుకుని ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. చీకటిపడితే చిన్నారులు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదంటే.. ఒంగోలు నగరంలో వీధి కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వీటిపై ప్రజల నుంచి అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా.. పట్టించుకునేవారు లేకుండా పోయారు. వీధి కుక్కల బారి నుంచి తమను రక్షించే వారు లేరా.. అంటూ కూటమి ప్రభుత్వ అధ్వానపు పనితీరును ప్రజలు విమర్శిస్తున్నారు.

మండల సమాఖ్యలను పరిశుభ్రంగా ఉంచాలి

- డీఆర్‌డీఏ పీడీ రవికుమార్


ఒంగోలులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

ఒంగోలు వన్‌టౌన్: ప్రతి మండల సమాఖ్య భవనాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ టి.రవికుమార్ సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరంలోని భాగ్యనగర్‌లో ఉన్న టీటీడీ సెంటర్‌లో శనివారం పీడీ స్వయంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. టీటీడీ సెంటర్‌లో ఉన్న చిల్లచెట్లు, చెత్త తొలగించారు. స్థానికంగా పారిశుధ్య పనులు చేస్తున్న రమణమ్మ అనే మహిళను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీపీఎంలు కృపారావు, నరసింహారావు, డి.రజనీకాంత్, బెజ్జం రమేష్‌బాబు, సిడాప్ సిబ్బంది, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో శనివారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు పర్యవేక్షణలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్‌కుమార్ పర్యవేక్షించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మానవ హారం, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుతాం...

మద్దిపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బందితో డీఎంహెచ్‌ఓ టి.వెంకటేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. శనివారం ఉదయం మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దీన్ని స్పెషల్ డ్రైవ్‌గా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆశా వర్కర్లకు జరుగుతున్న ఎల్సీడీసీ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. సోమవారం నుంచి ఎల్సీడీసీ గ్రామాల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆస్పత్రి డాక్టర్లు శిరీష, వినీల చౌదరి, సీహెచ్‌ఓ రజితకుమారి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, హెచ్‌వీలు నాగరాజ, సీతమ్మ, కార్యాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


మద్దిపాడు పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, పాల్గొన్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

చీమకుర్తిలో...

చీమకుర్తి: మున్సిపాలిటీ పరిధిలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొని మొక్కలు నాటారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాంక్రియాటిక్ క్యాన్సర్‌కు జీజీహెచ్‌లో ఆపరేషన్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: పాంక్రియాటిక్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒక మహిళకు ఒంగోలు జీజీహెచ్ వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. శనివారం జీజీహెచ్‌లోని సూపరింటెండెంట్ చాంబర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు ఆ వివరాలు వెల్లడించారు. కొత్తపట్నం గ్రామానికి చెందిన ఒక నిరుపేద మహిళ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కొద్దిరోజుల క్రితం చికిత్స కోసం జీజీహెచ్‌లోని వైద్యులను సంప్రదించగా, ఆమె లక్షణాలను బట్టి వైద్యులు ఆంకాలజీ విభాగానికి రిఫర్ చేశారు. వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన ఆంకాలజిస్ట్ డాక్టర్ కిషన్ సదరు మహిళ పాంక్రియాటిక్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. అప్పటికే ఆమెకు కళ్లు కూడా కనిపించని పరిస్థితికి చేరుకోవడంతో తక్షణమే శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. జీజీహెచ్‌లోని వైద్యుల బృందంతో కలిసి శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆ మహిళ పూర్తిగా కోలుకున్నారు. ఈ చికిత్స చేయాలంటే కనీసం రూ.8 లక్షల వరకు ప్రైవేటు వైద్యశాలలో ఖర్చవుతుందని, అలాంటిది రూపాయి ఖర్చు లేకుండా పూర్తిగా ఉచితంగా ఆపరేషన్ చేయడంతో జీజీహెచ్ వైద్యులను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు అభినందించారు. ఈ ఆపరేషన్‌తో జీజీహెచ్‌లో జిల్లా ప్రజలకు క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి వచ్చినట్లయిందని, ఎవరైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే జీజీహెచ్‌లోని అంకాలజీ విభాగంలో వైద్యులను సంప్రదించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున సూచించారు. విలేకరుల సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత, డాక్టర్ కిషన్, అనస్థీషియా హెచ్‌ఓడీ జయసుందరం, వైద్యులు త్రినాథ్ కుమార్, రంజిత్, హిమబిందు, పీజీలు సంహిత, శ్రావ్య, సత్య, పి.నాని, వర్షిత పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళులు

సంతనూతలపాడు: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని సంతనూతలపాడు, తక్కెళ్లపాడు, మైనంపాడు, పేర్నమిట్ట తదితర గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: నాగులుప్పలపాడులో శనివారం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే విజయ్ కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పలువురు రక్తదానం

ఒంగోలు సబర్బన్: మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఒంగోలు పాత గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు పాల్గొని రక్తదానం చేశారు.

ముగిసిన నవోదయ పరీక్షలు

మద్దిపాడు: మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 192 మంది విద్యార్థులను కేటాయించగా, 158 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో కేవైజీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలకు 73 మంది, కేవైజీజేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 85 మంది హాజరయ్యారు. ఈ కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా పెద్దిరెడ్డి కోటిరెడ్డి, మండవ ప్రభాకర్ వ్యవహరించారు. రూట్ ఆఫీసర్ కే శివాజీ, అసిస్టెంట్ డైరెక్టర్ ఫర్ డిసేబుల్ అర్చన పరీక్షలను పర్యవేక్షించారు.

ఎన్టీఆర్ కళాపరిషత్ వారోత్సవాలు ప్రారంభం



ఒంగోలు మెట్రో: స్థానిక పీవీఆర్ బాలుర హైస్కూల్ గ్రౌండ్లో శనివారం ఎన్టీఆర్ కళాపరిషత్ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో శనివారం నళినీ ప్రియ కూచిపూడి నృత్య అకాడమీ, చందు డ్యాన్స్ అకాడమీ వారు ఎన్టీఆర్ ప్రార్థన నృత్య రూపకం ప్రదర్శించగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. సాయంత్రం మంగళ వాయిద్యాలతో సన్నాయి కచేరి, నాదస్వరం, ఐదు గంటలకు మక్కెనేనివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆధ్వర్యంలో మాస్టర్ మాదాల దానయ్య నిర్వహణలో కోలాటం ప్రదర్శన నిర్వహించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నిర్వాహకులు


నృత్య రూపకాల ప్రదర్శనలు

నాదయోగి త్యాగరాజస్వామికి స్మృత్యంజలి


త్యాగరాజు విగ్రహానికి స్మృత్యంజలి ఘటిస్తున్న కళాకారులు


గాయత్రి మందిరంలో తూములూరి సుబ్రహ్మణ్యం గురువును సన్మానిస్తున్న త్యాగరాజ సేవా సమితి నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: దేశం గర్వించదగిన ప్రముఖ వాగ్గేయకారుడు నాదయోగి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలో శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ త్యాగరాజ స్వామి విగ్రహానికి పలువురు పుష్పమాలలు వేసి స్మృత్యంజలి ఘటించారు. ఈ సందర్భంగా లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరరావు మాట్లాడుతూ నిధి కన్నా రాముని సన్నిధి మిన్నయని భావించిన త్యాగయ్య సంగీతంలోని రాగ తాళాలను భగవన్నామస్మరణకే వినియోగించి నాదయోగిగా ప్రసిద్ధి చెందారని కొనియాడారు. ప్రత్యేకించి తన కీర్తనల ద్వారా తెలుగు భాషకు ఆనాడే వెలుగునిచ్చిన కారణజన్ముడు త్యాగయ్య అని అన్నారు. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కర్ణాటక శాస్త్రీయ సంగీతానికి పితామహుడిగా పేరుగాంచిన త్యాగరాజు కృతులకు భారతదేశమంతటా అత్యంత ఆదరణ ఉందన్నారు. నేటితరం వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, మిడసల మల్లికార్జునరావు, అంగలకుర్తి ప్రసాద్, మెడబలిమి సాంబశివరావు, మద్దులూరి శ్రీనివాసులు, జంధ్యం రాధారమణ, సింగంశెట్టి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు గాయత్రి మందిరంలో...

ఒంగోలు గాయత్రీ మందిర నిర్వహణలో త్యాగరాజ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక మంగమూరుడొంక గాయత్రి మందిరంలో 178వ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల సంగీత కార్యక్రమాలను రెండు రోజులపాటు నేత్రపర్వంగా నిర్వహించారు. మందిర ప్రాంగణ వేదికపై ఆశీనులై ఆలపించిన త్యాగరాజ కృతులు కీర్తనలు అద్యంతం వీనుల విందుగా అలరించాయి. తూములూరి సుబ్రహ్మణ్యం గురువును మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత ప్రకాష్ సన్మానించారు. కార్యక్రమంలో ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, పిన్నంరాజు నరసింహారావు, రామచంద్రుని రాధాకృష్ణ, చివుకుల రాజేశ్వరి, నాగేశ్వరరావు, తూములూరి రామసుబ్రహ్మణ్యం, తూములూరి నాగలక్ష్మి, కరవది సాయి శరణ్య, కొప్పోలు వెంకట నాగసాయి శృతి, నేలంబొట్ల సౌమ్య తదితరులు పాల్గొన్నారు.